కథ

# యోగామృతం

—కోడూరి శేషఫణి శర్మ

"యోగా తరగతులకు హాజరు కండి! మీ శరీరాన్ని బంగారు తీగలాగా అదుపులో ఉంచుకోండి!"– సిటీ కేబుల్ ప్రకటన.

హేమలతకి ప్రాణం లేచి వచ్చినట్లయింది. తను పేరుకి హేమలతే అయినా ఆకారంలో రుబ్బురోలులా వుంది. శరీరం తగ్గాలని ఎన్ని మందులు వాడినా, ఎన్నోసార్లు డైటింగ్ చేసి చూసినా ఫలితం కనబడలేదు. శరీరం నీరసపడిపోవడమూ, అదీ చూసి శ్రీవారు ముఖం చిట్లించడమూ జరుగుతూనే వుంది.

తన పేరునూ, పేరుకి తగ్గట్టుగా వున్న తన అందాన్ని చూచి సత్యమూర్తి యిష్టపడి పెళ్లి చేసుకున్నాడు. మధ్య తరగతి కంటె కాస్త హెచ్చుస్థాయిలో జీవితం సుఖమయంగా వుంది– పెళ్లయిన వాలుగేళ్లకి శరీరం తన అదుపు తప్పింది.

"పెళ్లయిన కొత్తలో నీ శరీర కైవారం నా చేతుల్తో చుట్టి కొలవ గలిగేవాడిని– ఇప్పుడా భాగ్యం లేదు హేమలతా!' ' అని సత్యమూర్తి ఆట పట్టిస్తూంటే ఏమీ చేయలేక పోతూంది.

ఇప్పుడిదేదో మంచి అవకాశం లాగే వుంది. యోగా తరగతులకి హాజరైతే మళ్లీ తన శరీరం మామూలు స్థాయికి వచ్చేస్తుంది. అదీగాక ఎన్నో రోగాలు రాకుండా నిరోధించ వచ్చునట కూడా!

హేమలతలో ఉత్సాహం ఉరకలు వేసింది. రిమోట్ కంట్రోల్‌తో టివి ని కట్టేసింది. ఫోన్ డయల్ చేసింది.

"దిసీజ్ రామకృష్ణా యోగా సెంటర్..." అవతలి నుండి వినిపించింది.

"సిటీ కేబుల్లో మీ ప్రకటన చూశాను. వివరాలు చెబుతారా?"

"ఎవరైనా చేరొచ్చు మేడం! నెలకి మూట యాభై రూపాయలు– రోజూ గంటసేపు ఆసనాలు నేర్పిస్తాం. మీ ఆరోగ్యానికీ, అందానికీ కూడా మంచిది. సబ్ కలెక్టరు గారి మిసెస్, డీయస్పీ గారి అమ్మాయి, ఎమ్మెల్యే గారి మరదిల్లా మా సెంటర్లో సభ్యులే. అప్పుడే నెల అయింది– మీ అడ్రస్ చెబితే మేమే వచ్చి మెంబర్‌షిప్ ఫారం తీసుకొంటాం. ఎప్పుడు రమ్మంటారు?" అవతలి వ్యక్తి ఎంతో వినమ్రతగా, ఆసక్తిగా అడిగాడు.

హేమలతకి మరింత ఉత్సాహం కలిగింది. పెద్ద పెద్ద వాళ్లంతా చేరారన్నమాట – తనూ చేరాలి – వాళ్లతో పరిచయాలు గట్రా...

"సాయంకాలం ఐదు గంటలకి రండి! మావారు కూడా యింట్లో వుంటారు – ఫార్మాలిటీస్ పూర్తి చేయొచ్చు" అంటూ అడ్రస్ చెప్పి రిసీవర్ పెట్టేసింది హేమలత.

రిమోట్ ఆన్ చేసి బుల్లితెర మీద వంటకాల తయారీ చూడసాగింది.

"అమ్మగారూ! వంట అయిందండీ! పచ్చడి ఏం చేయమంటారు" అడిగింది వంట మనిషీ పనిమనిషీ అన్నీ అయిన వలభై ఏళ్ల తాయారు.

"నిన్న టీవీలో చూశాంగా. ఆ పచ్చడికి అన్నీ సిద్ధం చేసి వుట్టా తాయారు! ఆ మిక్సీ తెచ్చి యిక్కడ పెట్టు– సరదాగా నేను చేస్తా" అంది హేమలత.


** ** **


హేమలతకి పరమానందంగా వుంది. రోజూ యోగా క్లాసులకి వెళ్లాలి. ఇంతకు ముందులా సన్నగా, అందంగా తయారవాలి. పెళ్లిళ్లకీ పేరంటాలకీ వెళ్లడానికి నామోషీగా ఫీలయ్యే పని వుండదు. శ్రీవారితో సరదాగా షికారుకీ వెళ్లవచ్చు. రెండేళ్ల నుంచి చచ్చిన చావుగా వుంది – ఎవరే మను కుంటారోనని – ఇకపై ఆ బెడద వుండదు. లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యొచ్చు– శరీరం గూర్చిన సమస్య తప్ప తనకి సమస్యలనేవే లేవు. ఇంటి పనీ వంట పనీ తను చెయ్యాల్సిన అవసరమే లేదు. ఉదయం లేచి కళ్లాపి చల్లడం నుంచి రాత్రి పక్కలు సర్దేపని వరకూ తాయారమ్మే చూస్తుంది. ఏ ఆడదానికైనా యింతకంటే సుఖమేం కావాలి?

ఒంటి గంటకు లంచ్ పూర్తి చేసి టి.వి చూస్తూ నిద్రలోకి జారుకుంది హేమలత!

** ** **

స్కూటర్ మీద తనని దిగబెట్టడానికి వచ్చిన సత్యమూర్తికి చేయ్యూపింది హేమలత. రామ కృష్ణా యోగా సెంటర్ లోనికి అడుగుపెట్టింది. మూడవ అంతస్తు టెరేస్ మీద జరిగే క్లాసులకి లిఫ్టుద్వారా చేరుకొంది. ఆసనాలకి అనుకూలంగా వుండాలని కొత్తగా పంజాబీ డ్రస్ కుట్టించుకొంది. తన భారీ కాయాన్ని ఆ డ్రెస్‌లో చూచి ఎవరేమను





కొంటారోవని పైవ ఛీరమ చుట్టుకొని, కొంగు నిండుగా కప్పుకొని వచ్చింది. క్లాసుకి వచ్చాక చీర తీసేసి వెళ్లేప్పుడు మళ్లీ కట్టుకోవచ్చు.

యోగా సెంటరు డైరెక్టరు హైస్కూలు పిల్లలకి మాస్ డ్రిల్లు చేయించినట్టుగా ఎక్సర్ సైజులు చేయించాడు. క్రమంగా సిలబస్ ప్రకారం ఆసనాలు నేర్పిస్తాననీ, ఓపిగ్గా వచ్చే వాళ్లకే ఫలితం వుంటుందనీ అన్నాడు. వలభై యాభై మంది ఆడ వాళ్లలో తామా ఒకతెగా 'డ్రిల్లు' లాగా చేస్తూ చిన్న పిల్లయి పోయినట్లు సంబర పడింది హేమలత.

మూడు నాలుగు నెలలు గడిచాయి. యోగా మాష్టరు ఏవేవో నాలుగైదు రకాల ఆసనాలని ఎక్సర్ సైజుల్లాటివి చేయిస్తున్నాడు. శరీరం వంగి రావడం లేదు. బలవంతంగా చేయాలని చూస్తే ఆయాస మొస్తుంది. నడమూ, ఎముకలు పట్టుకుపోతాయేమోనని భయమేస్తూంది. ఇంతకన్నా సులభ పద్ధతులు ఎవరైనా కనిపెడితే బావుణ్ణు— అనిపిస్తుంది. అయినా అలాగే యోగా క్లాసులకి వస్తూంది హేమలత. పెద్ద పెద్ద హోదాలో వున్న వాళ్లతో పరిచయాలు, ఫంక్షన్లు, పార్టీలు, ఐస్ క్రీములూ, స్వీట్లూ— తియ్యని కబుర్లు అలవాటయ్యాయి. ఇంతకుముందు కంటే యిప్పుడు కాస్త నామోషీగా అనుకోవటం మాత్రం తగ్గింది. అందరూ దాదాపు తనలాంటి వారే— అందరిలో తనూ ఒకతె. అంతేకానీ, శరీరం తగ్గటం లేదు— వయసుతో బాటు వొళ్లూ వస్తుంది అంటారు కొందరు. నిజమేనేమో అనుకొంటూంది.

** ** **

"మీ అమ్మమ్మ, తాతయ్య వస్తున్నారు హేమా! రేపు ఉదయం స్టేషన్‌కెళ్లాలి— వాళ్లని చూచి చాలా ఏళ్లయింది కదా! ఓ నెల రోజులపాటు మన దగ్గరే ఉండి పొమ్మందాం!" అన్నాడు సత్యమూర్తి.

"అవునండీ!అమ్మమ్మకి నేనంటే ఎంత అభిమానమో. అరవై ఐదేళ్లు పైబడినా సంసారం తెమలక మన దగ్గరకి రానేలేదు. ఎలాగూ వస్తున్నారు— నెలో రెణ్ణెల్లో వుండమందాం!" అంది హేమలత.

భ్రమరాంబ, మల్లికార్జునరావుగారు రానే వచ్చారు. అమ్మమ్మ గారింటి ముచ్చట్లు, అమ్మ గారింటి ముచ్చట్లు తెగ దొర్లిపోతున్నాయి. మామ గారి పిల్లలు, వారి చదువుల గూర్చిన వివరాలు అయ్యాయి. పెళ్లిళ్ల మాటలు అయ్యాయి. పెద్ద మనుషులయిన ఆడపిల్లల గూర్చి అనుకున్నారు.

అమ్మమ్మ, తాతయ్య రాకతో యిల్లంతా సందడిగా వుంది. హేమలత పిల్లలు రవీ, శశీ కూడా ఉత్సాహంగా తయారయ్యారు. రెండ్రోజుల తర్వాత అలవాటు ప్రకారం సత్యమూర్తి స్కూటర్ వెనుక ఎక్కి యోగాకి బయలుదేర బోయింది హేమలత.

"అమ్మాయ్! ఓ నెల రోజులు సరదాగా యిక్కడుండి పోదామని వచ్చామే! ఆ యోగా వదలిపెట్టి నాతో బాటు వుండు. ఆ తర్వాత నీ అలవాట్లు...నీ యిష్టమూ..." అంది భ్రమరాంబ.

అమ్మమ్మ మీది అభిమానం కొద్దీ కాదనలేకపోయింది హేమలత. యోగాకెళ్లడం తాత్కాలికంగా మానేసింది.

"రేపు మీ పెళ్లిరోజు కదమ్మాయ్! కుంకుళ్లు దంచుదాం రా! ఎంచక్కా తలంటి పోస్తాను" అని పనిలోకి దించింది.

"పెళ్లిరోజు కదా! సరదాగా అలా సాయిబాబా

గుడికి నడిచి వెళ్లి రారాదూ– పిల్లల్ని కూడా తీసుకువెళ్లండి"– అంటూ మరునటి రోజు వురమాయించింది.

"ఇంటి ముందు యింత స్థలం వుంది– మరీ రెండంటే రెండు ముగ్గు కర్రలు వేయకపోతే, చుక్కల ముగ్గు పెట్టుకోవచ్చు కదే!" అంటూ హేమలతమా, ముని మనవరాలినీ తెల్లారేసరికి ముగ్గు వేయటానికి అలవాటు చేసింది. ఏ ఏ సందర్భాల్లో ఎలాంటి ముగ్గులు వేయాలో భ్రమరాంబ చెబుతూంటే 'ఓహో! యిది కూడా ఒక సైన్సేనేమో' అనిపిస్తూంది.

"అమ్మాయ్! ఈ రోజు తాయారుని వంటింట్లోకి రానీకు! మనమే రుచిగా వండుకుందాం. మామిడికాయ పచ్చడి చేద్దాం. మీ తాతయ్యకి ఎంతిష్టమో– మిక్సీలో అయితే మరీ మెత్తగా అవుతుంది. ముక్కలు ముక్కలుగా పంటి కింది కొచ్చేట్టు రోట్లో నూరు. అబ్బాయిక్కూడా అలాగే యిష్టమనుకుంటాను" అంటూ వంటింటిని సందడిగా మార్చేసింది భ్రమరాంబ.

"పనివాడు చూడమ్మా! పైపుతో నీరు పెట్టడానికి కూడా బద్ధకించాడు. మొక్కలు ఎలా వాడిపోతున్నాయో!" అంటూ హేమలతా, పిల్లలతో కలిసి కాంపౌండులోని మొక్కల కన్నిటికీ నీరు పెడుతూంది.

అమ్మమ్మతో కలిసి చిన్న చిన్న పనులు చేయడం, పెద్ద పనుల్లో సాయపడడం హేమలతకి సరదాగా వుంది. ఇంట్లో ఒక పెద్ద దిక్కు వుంది కదా అని భరోసాగా వుంది.

"కూరగాయలు మనమే తెచ్చుకుందామమ్మాయ్! మగాళ్లకి చచ్చూ పుచ్చూ తెలీదు" అంటూ మార్కెట్టుకి బయలు దేరే అమ్మమ్మ వెంట వెళ్లడం హేమలతకూ సరదాగానే వుంది.

చూస్తుండగానే నెల రోజులూ యిట్టే గడిచిపోయాయి. భ్రమరాంబ మల్లికార్జునరావూ వెళతామంటే మరో వారం రోజులు బలవంతంగా వుంచుకొంది హేమలత. అరవై ఐదేళ్ల వయసులో కూడా తొక్కుడు బిళ్ల ఆడటంలోని మెళకువలు పిల్లకి చూపించింది. గవ్వలతో పందెం విసురుగా వేస్తూ హేమలతో అష్టాచెమ్మా ఆడి ఓడించింది భ్రమరాంబ.

ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ పనులు చేస్తూ చలాకీగా మారింది హేమలత– అమ్మమ్మా, తాతయ్యా వాళ్ల వూరెళ్లి పోయారు.

ఓ రోజు రాత్రి "హేమూ! నిన్న నీవు గమనించు కొన్నావో లేదో! నీ కైవరాన్ని కొలవ గలుగుతున్నాను చూడు' ' అన్నాడు సత్యమూర్తి చేతులతో చుట్టేస్తూ. అలాగే జంటగా నిలబడి నిలువుటద్దంలో చూచుకొంది.

"అవునండీ! మరి కాస్త తగ్గాలి!" అంటూన్న హేమలత చేతికి భ్రమరాంబ రాసిన ఉత్తరం యిచ్చాడు సత్యమూర్తి.


"చి.కుం.సౌ. హేమలతకు ఆశీస్సులు. ఉభయ కుశలోపరి. అక్కడున్న నెలవాళ్లు నాకూ, మీ తాతయ్యకూ సరదాగా గడిచింది. పనులనీ, పాటలనీ, అవనీ యివనీ నిన్ను కాస్త యిబ్బంది పెట్టానేమో. ఒక్కటి గమనించు– ఇల్లాలు లేచింది మొదలు పడుకొనేవరకు చేసే పనులన్నీ ఎక్సర్‌సైజుల కిందికే వస్తాయి. ముగ్గులేయటం నుండి పక్కలేసుకోవడం వరకు చేసుకోగలిగితే ఏ యోగా అవసరముండదు. యోగా సెంటర్ వరకూ స్కూటర్ మీద వెళ్లే నీకు శారీరక శ్రమెక్కడుంది? టివి ఆన్ చేయడానికి కూడా రిమోట్ వాడే కాలం కదా! ప్రతి చిన్న దానికీ మిక్సీ, గ్రైండరూ వుండనే వున్నాయి. చిన్న పనికీ, పెద్ద పనికీ తాయారమ్మ వుంది– ఇక నీకు శరీరం మాటెలా వింటుంది? నీళ్లు పడుతూ, పొద్దుటే లేచి చుక్కల ముగ్గు లేస్తూ, పెళ్లిళ్లకీ పేరంటాలకీ సరదాగా నడిచి వెళ్లి వస్తూ, యింట్లో దిన చర్యలన్నీ చక్కబెట్టుకుంటూ వస్తే యిల్లాలికి అంతకంటే వేరే ఏ ఎక్సర్‌సైజులూ అక్కర్లేదు. ఏ యోగాక్లాసులూ, ఏ జిమ్ ఫిట్‌నెస్ సెంటర్లూ అవసరం లేదు. ఆధునిక పరికరాలని వాడకూడదని కాదు– ఉద్యోగాలు చేసేవాళ్లకి ఎలాగూ తప్పదు. ఇంటి పట్టున వుండే వాళ్లకీ కొంతయినా శారీరక శ్రమ వుండాలి కదా! నీవు గమనించావో లేదో! కాస్త తగ్గావు యీ నెల రోజుల్లో– ఇలాగే చేస్తే ముందటిలా బంగారు తీగెలా అవుతావు– చాదస్తం అనుకోకు– పిల్లలకి ఆశీస్సులు."

–మీ అమ్మమ్మ,
భ్రమరాంబ.

చిమ్ముదలతో యోగామృత సారాన్ని బోధిస్తున్న అమ్మమ్మ ఉత్తరంలోంచి తొంగి చూస్తూన్నట్టు కనబడింది హేమలతకి. సత్యమూర్తి ఆమె బుగ్గపై చిలిపిగా చిటికేశాడు.

## తెలుగులో మనోజ్ బాజ్‌పాయ్

రామ్‌గోపాల్ వర్మ 'సత్య' సినిమా ద్వారా దేశం మొత్తమ్మీద రాత్రికి రాత్రే హాట్‌ఫేవరెట్ అయిన మనోజ్‌బాజ్‌పాయ్ ఇప్పుడు తెలుగులో రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగార్జున తీస్తున్న సుమంత్, అంతర హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ప్రేమకథలో నటిస్తున్నాడు. ఈ సినిమా చాలాభాగం పశ్చిమగోదావరి జిల్లాలో షూటింగ్ జరుపుకుంది.



## 40 లక్షల రూపాయల సెట్టు

డబ్బు మంచి నీళ్లలా ఖర్చు పెట్టారనే మాట రాజకీయ నాయకులిచ్చే పార్టీలకీ, మన సినిమావాళ్లు వేసే సెట్టింగులకీ కరెక్టుగా సరిపోయే మాట. కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'యమజాతకుడు' సినిమాలోని యమలోకం, వైతరిణీ నది సెట్టుకోసం అక్షరాల నలభై లక్షలు ఖర్చు చేసారట. కేవలం ఒక సెట్టింగ్‌కే ఇంత ఖర్చు పెడితే మొత్తం సినిమాకి ఎంతవుతుందో? ఏమైనా మోహన్‌బాబు ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే.

